ప్రజాశక్తి
మంగళవారం 28 మార్చి 2023
5
శ్రీకాకుళం




రేపు అరసవల్లి హుండీ లెక్కింపు



ప్రజాశక్తి - శ్రీకాకుళం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలోని హుండీలను ఈనెల 29వ తేదీన లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 29న ఉదయం ఎనిమిది గంటలకు దేవాదాయశాఖ ఆధ్వర్యాన అనువంశిక ధర్మకర్త, అర్చకులు, యాత్రికులు, గ్రామపెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు తెలిపారు.

కొత్త వైరస్‌పై అప్రమత్తత



- హెచ్3ఎన్2 వైరస్‌పై జాగ్రత్తగా ఉండాలి
- ఫ్లూ, కోవిడ్ లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకోవాలి
- కోవిడ్ ప్రోటోకాల్ పాటించాలని వైద్యారోగ్యశాఖ సూచన

కోవిడ్ ప్రభావం పెద్దగా లేదనుకుంటున్న తరుణంలో ప్రస్తుతం కొత్త రకం వైరస్ జనానికి ఆందోళన కలిగిస్తోంది. కొత్త వైరస్ హెచ్3ఎన్2పై రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం జిల్లా వైద్యారోగ్యశాఖను అప్రమత్తం చేసింది. వచ్చే నెల 10, 11 తేదీల్లో మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించింది. మందులు, పరీక్ష కిట్లు, పడకలు, వైద్య పరికరాలు, ఆక్సిజన్ లభ్యత తదితర వివరాలతో మాక్ డ్రిల్‌లో పాల్గొనాలంటూ సూచించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. సిబ్బందితో ఇంటింటా పర్యవేక్షణ చేస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కొత్త రకం వైరస్ హెచ్3ఎన్2 ఇతర రకాల ఫ్లూల మాదిరిగానే జ్వరం, దగ్గు గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, ముక్కు కారడం, చలి, తలనొప్పి, అలసట, కొన్నిసార్లు వికారం, వాంతులు, విరేచన లక్షణాలు కనిపిస్తాయని వైద్యారోగ్యశాఖ అధికారులు చెప్తున్నారు. ఈ లక్షణాలు పెద్దల కంటే పిల్లల్లోనే అధికంగా కనిపిస్తాయని అంటున్నారు. వైద్యుల సలహా లేకుండా సొంతంగా యాంటీ బయాటిక్ మందులు వాడడం అంత మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. వైరస్ సోకిన వ్యక్తి మాట్లాడినప్పుడు, దగ్గినప్పుడు లాలాజలం, తుంపర్ల ద్వారా ఇతరులకు ఏదేని ఉపరితలాలపై పడడం వల్ల వైరస్ కొన్ని గంటల పాటు అలాగే ఉంటుందని చెప్తున్నారు. అలాంటి ప్రదేశాలను ముట్టుకున్న వ్యక్తులకు ఈ వైరస్ సోకే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. కలుషితమైన ఉపరితలాలను తాకిన తర్వాత ముక్కు, కళ్లు, నోటిని తాకినా వైరస్ శరీరంలోకి ప్రవేశించే అవకాశముందని వైద్య నిపుణులు చెప్తున్నారు.

న్యుమోనియాకు దారితీసే అవకాశం?

హెచ్3ఎన్2 చికిత్సకు చాలావరకు యాంటీ వైరస్ మందులు ఉన్నాయని వైద్యారోగ్యశాఖ అధికారులు చెప్తున్నారు. జ్వరంతో పాటు ఇతర లక్షణాలు కనిపిస్తే 48 గంటల్లోగా వైద్యులను సంప్రదించి మందులు వినియోగిస్తే వైరస్ తీవ్రతను తగ్గించవచ్చని అంటున్నారు. కొత్త రకం వైరస్ సోకితే న్యుమోనియాకు దారి తీయొచ్చని హెచ్చరిస్తున్నారు.

మాస్క్ ధారణ మరిచిన జనం

కోవిడ్ కేసులు నమోదు కాకపోవడంతో క్రమేణా జనం మాస్క్ ధారణ మరిచిపోయారు. శానిటైజర్ వినియోగం, భౌతిక దూరం వంటి జాగ్రత్తలను పాటించడం పూర్తిగా విస్మరించారు. కొత్త వైరస్ ప్రబలడానికి అవకాశాలు ఉన్న నేపథ్యంలో కోవిడ్ ప్రోటోకాల్ పాటించాలని వైద్యారోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా మాస్క్ ధారణతోనే కోవిడ్ కేసులను నియంత్రించగలిగామని, జనం ఆ రకమైన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్తున్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ఒకవైపు కొత్త రకం వైరస్ భయపెడుతుంటే, మరోవైపు అకాల వర్షాలతో జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పులతో జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరంతో పాటు దగ్గు, ఇతర లక్షణాలు కనిపిస్తుండడంతో కోవిడ్ వైరస్ లేదా కొత్త రకం వైరస్ అనే ఆందోళనతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. సాధారణ జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్, డెంగీ ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రయివేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా వైద్యారోగ్యశాఖ మాత్రం మలేరియా, టైఫాయిండ్ కేసులు లేవని చెప్తున్నా వాటి బారిన పడిన వారితో ప్రయివేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.

కోవిడ్ లక్షణాలు కనిపిస్తే అలక్ష్యం చేయొద్దు



జ్వరం వంద డిగ్రీ సెల్సియస్ దాటితే తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. వైరస్ సోకిన వారిలో దాదాపు కోవిడ్ లక్షణాలే ఉంటాయి. మూడు రోజుల పాటు జ్వరం ఉంటే వైద్యులను వెంటనే సంప్రదించి చికిత్స తీసుకోవడం మంచిది. జ్వరం ఉన్న వాళ్లందరికీ పరీక్షలు చేస్తున్నాం. జిల్లాలో ఎటువంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదు. మాస్క్ ధారణ, శానిటైజర్ వినియోగం, భౌతిక దూరం వంటి జాగ్రత్తలు పాటించాలి.

- బి.మీనాక్షి,
జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి



హైవేపై దారి దోపిడీలు

- ఫ్లైఓవర్లపై మాటు
- ఒంటరిగా వచ్చిన వారే లక్ష్యం
- రాత్రివేళ ప్రయాణాలకు భయపడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం క్రైమ్

జాతీయ రహదారిపై దారి దోపిడీ ఘటనలు పెరుగుతున్నాయి. పోలీసులమని చెప్పి ద్విచక్ర వాహనాలను ఆపి వారి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్లతో ఉడాయిస్తున్నారు. ఒంటరిగా ప్రయాణించే వారే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ప్రతిఘటిస్తే దాడులు చేస్తున్నారు. ఇదేదో అర్ధరాత్రి జరిగిన ఘటనలు కావు. రాత్రి ఏడు గంటల్లోపు జరుగుతున్నవే. దీంతో హైవేలపై ఒంటరిగా ప్రయాణించడానికి ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. తప్పనిసరి పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు.

ఎచ్చెర్ల మండలం నవభారత్ కూడలిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పాలిషింగ్ పని చేసుకునే రాము ఈనెల 24న రాత్రి ఏడు గంటల సమయంలో ఇంటికి బయలుదేరాడు. శ్రీకాకుళం సింహద్వారం వద్ద జాతీయ రహదారిపై ఓ వ్యక్తి ఆయన్ను ఆపాడు. తాను నాన్ యూనిఫారంలో ఉన్న పోలీసునని, బండికి ఉన్న బ్యాగులో ఏముందో చూపాలన్నాడు. మందు అక్రమ రవాణా చేస్తున్నావా అని ప్రశ్నించాడు. తాను పాలిషింగ్ పని చేస్తుంటానని, భోజనం క్యారియర్ అని రాము చూపాడు. లైసెన్స్, సి-బుక్ చూపాలని ఆ వ్యక్తి గదమాయించడంతో తన జేబులో ఉన్న పర్సు తీసి వాటిని చూపిస్తుండగా ఆ వ్యక్తి పర్సు లాక్కున్నాడు. ఆయన తేరుకునేలోపే అందులో ఉన్న రూ.18 వేలను లాక్కొని పర్సును ఆయనపై విసిరికొట్టి బండిపై పరారయ్యాడు.

ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని సూర్య మెటల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న లక్ష్మణరావు కుటుంబసభ్యులు ఊరు వెళ్లడంతో ఇంట్లో ఉన్న రూ.3,500 పట్టుకుని డ్యూటీకి బయలుదేరాడు. ఎచ్చెర్ల ఫ్లైఓవర్ వద్ద కుప్పిలి వెళ్లే రోడ్డులో ఒక వ్యక్తి ఆయన సైకిల్‌ను ఆపాడు. ఎటు వెళ్తున్నావని ప్రశ్నించి ఆయన్ను తనిఖీ చేశాడు. జేబులో కవర్‌లో డబ్బులు ఉండడంతో దాన్ని లాక్కోవడానికి ప్రయత్నించగా, ఆయన ప్రతిఘటించడంతో కొట్టి మరీ డబ్బులు గుంజుకున్నాడు.

రణస్థలం మండలం కోష్టకు చెందిన రాజశేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆయన వెనుక బండిపై వచ్చి టైరులో గాలి తగ్గిందని చెప్పారు. దీంతో ఆయన బండి ఆపి వంగి టైరు చూస్తుండగా, ఆయన జేబులోని సెల్‌ఫోన్‌ను చోరీ చేసి పరారయ్యారు.

ఎచ్చెర్లకు చెందిన వెంకటరావు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అల్లినగరం వద్ద హైవేపై ఇద్దరు వ్యక్తులు బండిని ఆపాలని కేకలు వేశారు. దీంతో ఆయన భయపడి వేగంగా వెళ్లడంతో ఆయన్ను వెంబడించారు. లావేరు మండలం బుడుమూరు వద్ద జన సంచారం ఉండడంతో ఇద్దరు వ్యక్తులు వెనుదిరగడంతో వెంకటరావు ఊపిరి పీల్చుకున్నాడు. ఇవి కొన్ని ఘటనలు మాత్రమే. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందన్న భయంతో ఉండిపోతున్నారు. స్టేషన్‌కు వెళ్తే ఆరోజు కూలి డబ్బులు కూడా పోతాయన్న ఆందోళనతో మిన్నకుంటున్నారు. దారి దోపిడీ ఘటనలతో జాతీయ రహదారిపై రాత్రిపూట ప్రయాణించాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. దోపిడీ ఘటనలపై పోలీసులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

స్పీకర్ పదవిని భ్రష్టు పట్టించారు

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాజ్యాంగబద్ధమైన శాసనసభ స్పీకర్ పదవిని తమ్మినేని సీతారాం భ్రష్టు పట్టించారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ్మినేని తక్షణమే స్పీకర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌గా వ్యవహరిస్తున్న తమ్మినేని తీరుపై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్ భారత రాజ్యాంగానికి లోబడే పనిచేయాలని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని అతిక్రమిస్తే న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటాయన్నారు. రాజ్యంగ నిబంధనలు స్పీకర్‌కు వర్తిస్తాయని, స్పీకర్ తమ్మినేని మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైసిపి బహిరంగ సభలు, పార్టీ సమావేశాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. 2019 జూన్‌లో ఇంటర్, అదే ఏడాది ఆగస్టులో హైదరాబాద్‌లోని గాంధీ లా కాలేజీలో డిగ్రీ చేసినట్లు దొంగ సర్టిఫికేట్లను సృష్టించారని ఆరోపించారు. ఇప్పటికైనా సీతారాంకు విలువలుంటే తక్షణమే రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. దీనిపై రాష్ట్రపతి, గవర్నర్, సుప్రీం, హైకోర్టు చీఫ్ జస్టిస్‌లకు, ముఖ్యమంత్రి జగన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. స్పీకర్‌ను కులానికి అంటగట్టి టిడిపి నాయకులపై విమర్శలు చేయడం తగదన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, వెంకన్న యాదవ్, నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, మీడియా సెల్ కన్వీనర్ డాక్టర్ జామి భీమశంకర్, సింతు సుధాకర్, ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో వైద్యం మరింత చేరువ

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం మరింత చేరువవుతుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పెద్దపాడులోని మంత్రి కార్యాలయంలో సంచార వాహనాలను జెండా ఊపి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. పేదల గుమ్మం దగ్గరకు వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ప్రతి పిహెచ్‌సిలో ఉండే ఇద్దరు వైద్యులు రోజు విడిచి రోజు తమకు కేటాయించిన గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. దీర్ఘకాలిక రోగులకు నిరంతరం మందులు, ఇతర వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉండనున్నాయని చెప్పారు. రిఫర్ చేయాల్సి వస్తే సమీప పెద్దాస్పత్రికి చేస్తారన్నారు. దేశంలోనే ప్రథమంగా ఈ సేవలు తీసుకొచ్చామని, వీటి లక్ష్యాలు చేరుకునేందుకు వైద్య సిబ్బంది అంతా కలిసి పనిచేయాలని కోరారు. గ్రామాల్లోని ప్రజలు ఈ వైద్య సేవలు వినియోగించుకోవాలన్నారు. ప్రయివేటు వైద్యంపై మక్కువ పెంచుకునే కన్నా ఇటువంటి ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలన్నారు. రిమ్స్ ఆస్పత్రికి 900 పడకలు ఏర్పాటు చేశామని చెప్పారు. వైద్య, వైద్యేతర సిబ్బందిని అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ అధికారి లక్ష్మీతులసి, గొండు రఘు, హబీబుల్లాఖాన్, అంధవరపు సంతోష్, 104 కో-ఆర్డినేటర్ లక్ష్మణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి


జెసి ఎం.నవీన్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జెసి నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రతి అర్జీని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, ఫిర్యాదుదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్పందనలో స్వీకరించే ప్రతి దరఖాస్తునూ 24గంటల్లో ఓపెన్‌చేసి పరిష్కరించడమా లేదా తిరస్కరించడమా అనే అంశాలపై వివరణ ఇవ్వాలన్నారు. తిరస్కరించదలిస్తే సరైన కారణాలు తెలపాలన్నారు. మండల స్థాయిలో కూడా క్వాలిటీ డిస్పోజల్ పెరగాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న స్పందనలో ఏ ఒక్కరూ నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించకుండా జవాబుదారి తనంతో పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 196 మంది అర్జీదారులు తమ సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు దరఖాస్తులు అందజేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీకృష్ణ, ఉప కలెక్టర్ జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా పరిషత్ సిఇఒ వెంకటరామన్, మెప్మా పీడీ కిరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, డిఎస్ఒ వెంకటరమణ, డిపిఒ రవికుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

శ్రీకాకుళం : స్పందనకు వస్తున్న ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించేలా చూడాలని ఎస్‌పి జిఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్‌పి కార్యాలయంలో ఆమె వినతులను స్వీకరించారు. స్పందన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. స్పందనకు వచ్చిన అర్జీదారుల సమస్యలను ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎస్‌పి నిర్వహించిన స్పందనకు మొత్తం 39 ఫిర్యాదులు వచ్చాయి. నాలుగు చీటింగ్, ఐదు భూతగాదాలు, ఆరు ఆస్తి తగాదాలు, ఒక మిస్సింగ్‌తో పాటు ఎనిమిది పాత ఫిర్యాదులు వచ్చాయి. అర్జీలను, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. బాధితుల సమస్యలను విని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై తనకు ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని సూచించారు. స్పందనలో ఆదనపు ఎస్‌పి విఠలేశ్వరరావు పాల్గొన్నారు.

1323 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు సోమవారం 1323 మంది గైర్హాజరయ్యారు. వీరిలో సాధారణ కోర్సులకు 1135 మంది, వృత్తి విద్యా కోర్సులకు 188 మంది పరీక్షలకు హాజరు కాలేదు. మొత్తం 28,980 మంది హాజరు కావాల్సి ఉండగా 27,657 మంది రాసినట్లు ఆర్ఐఒ ఎస్.తవిటినాయుడు తెలిపారు. సాధారణ కోర్సులకు 26,478 మందికి గాను 25,343 మంది, వృత్తి విద్యా కోర్సులకు 2,502 మందికి 2,314 మంది పరీక్ష రాశారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారంతో ఆరోగ్యం లభిస్తుందని శ్రీకాకుళం ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ శోభారాణి అన్నారు. స్థానిక దమ్మలవీధి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శించిన పలురకాల పోషక విలువలు గల పదార్థాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి పి.మణి, పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి, ఎంఎస్‌కెలు శ్వేతహరిణి, సబానా బేగం, గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఒ శోభారాణి

జిల్లాలో భారీ వర్షం

(6లో)

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com
www.prajasakti.com

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



పరామర్శిస్తున్న శ్రీరాములు

కారుణ్య నియామకాలు చేపట్టాలి

శ్రీకాకుళం : కోవిడ్‌తో మృతి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వీరఘట్టం తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ... మట్ట గణపతి కరోనా మృతి చెందారని అన్నారు. కార్యక్రమంలో భాగంగా పిఎన్ కాలనీలోని మృతుని భార్య కుమారుడిని సోమవారం పరామర్శించారు. గణపతి కరోనా మృతి చెంది రెండేళ్లు అవుతున్నా ఆయన కుమారుడికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, ఎపి ఆర్‌ఎస్‌ఎ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పివేణుగోపాలరావు, జిల్లా సెక్రెటరీ బి.వి.వి.ఎస్.రాజు, బెజవర్ జి.ఎల్.ఈ.శ్రీనివాసరావు, జిల్లా కో-ఆపరేటివ్ చైర్మన్ పి.లక్ష్మణరావు, ఎపిజెఎస్యుసిఇ స్టేట్ జనరల్ సెక్రెటరీ పిషాన గోవిందరావు పాల్గొన్నారు.

బకాయిలను చెల్లించాలి

పొందూరు: పెండింగ్‌లో ఉన్న బకాయిలు, డిఎలు, జిపిఎఫ్ రుణాలు, మెడికల్ బిల్లులు, పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని తహశీల్దార్ ఎస్.రాంబాబు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రెవెన్యూ ఉద్యోగులు ఆందోళన చేశారు. ఎపి జెఎసి ఆదేశాల మేరకు ఈ నెల 9 నుంచి వచ్చే నెల 4 వరకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు అవుతున్నట్లు తెలిపారు. వచ్చే నెల 5న రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం తదుపరి కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

రైతుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం వెదుళ్లవలస గ్రామంలోని సొసైటీ కార్యాలయంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నెముక లాంటివారని, రైతులు సుభిక్షంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం రైతులు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. సొసైటీ తీసుకున్న రుణాలను క్రమంతప్పకుండా తీర్చిస్తే సున్నా వడ్డీ వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయిడు, ఉప ఎంపిపిలు కె.తాతారావు, కె.అప్పారావు, సిఇఒ బి.రాంబాబు, మేనేజర్ కిరణ్మయి, డైరెక్టర్‌లు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మోడీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల మండలం కేంద్రంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందని విమర్శించారు. కార్మిక హక్కులు కాలరాస్తూ పెట్టుబడిదారులకు కార్మికులను బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్, స్కీం వర్కర్లు, డైలీవేజ్, కంటింజెంట్ ఉద్యోగుల, కార్మికుల రెగ్యులరైజేషన్, సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని, కేరళ తరహా రైతు రుణమాఫీ చేయాలని అన్నారు. విద్యుత్ సవరణ బిల్లు-2022 రద్దు చేయాలన్నారు. ఉపాధిహామీ చట్టానికి బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లకు పెంచి పట్టణాలకు విస్తరింపజేయాలన్నారు. కుటుంబానికి 200 రోజులు పని కల్పించి రూ.600 కూలి ఇవ్వాలన్నారు. కౌలు రైతులను గుర్తించి భరోసా, పరిహారాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు డి.బంగారురాజు, హమాలీస్ యూనియన్ నాయకులు ఎస్.రమణ, నీలయ్య సంజీవరావు, అప్పారావు, అసిరప్పడు, రాజు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

వజ్రపుకొత్తూరు : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు అన్నారు. ఏప్రిల్ 5న చలో ఢిల్లీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం బెండిలో చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా వంశధార శివారు భూములకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించలేని ప్రభుత్వాన్ని రైతు ప్రభుత్వమని అంటారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి తమ్మినేని భాస్కరరావు, కె.బాలాజీ, బి.రామకృష్ణ, కె.సూధన, కె.వెంకటరావు, మురళి, తారకేశ్వరరావు, నరేష్ పాల్గొన్నారు.



ఎచ్చెర్ల : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తేజేశ్వరరావు

ఆమదాలవలస : చలో ఢిల్లీని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ... పట్టణంలోని పారిశ్రామిక వాడ వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా పారిశ్రామిక వాడలో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పంచాది లతాదేవి, రమణ, చిట్టిబాబు, నరసింగరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: కొత్తూరులో చలో ఢిల్లీ పోస్టర్‌ను ప్రజా సంఘం నాయకులు సిర్ల ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.గౌరమ్మ, ఎస్.ధనలక్ష్మి, పి.లక్ష్మి, కె.జ్యోత్స్న, వై.నిర్మల, ఎన్.నిర్మల, కె.రమణమ్మ పాల్గొన్నారు.



కొత్తూరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న మోహనరావు



ఆమదాలవలస : కార్మికులతో మాట్లాడుతున్న నాగమణి

మున్సిపాలిటీకి పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఆశీల వసూలుకు సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలో మున్సిపాలిటీకి గతేడాది కంటే ఆదాయం పెరిగింది. గ్రామ దేవత శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల నేథ్యంలో ఈ సారి వేలం పాటకు గట్టిపోటీ ప్రజాశక్తి ప్రచురించిన కథనంతో మున్సిపల్ అధికారులు మేల్కొన్నారు. పాట దారులు సిండికేట్ అవ్వకుండా జాగ్రత్తపడారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆశీల వసూలుకు రూ.23.52 లక్షలు వేలం పాట పాడిన విషయం తెలిసిందేద. రానున్న ఆర్థిక సంవత్సరానికి గతం కంటే పెరుగుదల కనిపించాలని మున్సిపల్ కమిషనరు రమేష్ పాటదారుల ఒత్తిడికి లొంగకుండా బహిరంగ వేలం పాట నిర్వహించారు. పాటదారులు రూ.30.54 లక్షలకు పాట పాడటంతో మున్సిపాలిటీకి భారీగా రెవెన్యూ సమకూరింది. గత ఆర్థిక సంవత్సరం కంటరీ సారి రూ.7,0,2750లు అదనంగా ఆదాయం వచ్చింది. మున్సిపాలిటీ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి వీధి గుత్త, బజారు గుత్త వసూలు చేసేందుకు నిర్వహించిన వేలం పాటను రూ.28.90లక్షలకు, కమేళా పాటను రూ.1.55 లక్షలకు, లైబ్రరీ పేపర్ల అమ్మకానికి రూ.6200కు పిట్ట బైరాగి దక్కించుకున్నారు. కొబ్బరి చెట్ల ఫలసాయం రూ.3,550లకు దక్కత విశ్వేశ్వరరావు పాటను దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో భాగంగా మున్సిపల్ మేనేజర్ దుర్గా హరిమోహన్, ఆర్ఐ అమర్, సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేష్

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

రెవెన్యూ మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సిఎం జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఏర్పాటు మూడో విడత వైఎస్ఆర్ ఆసరా నమూనా చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాదయాత్రలో డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు రుణమాఫీ చేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ముందున్న కాలంలో ఆడ పడుచులకు, అక్కచెల్లెళ్లకు ఆత్మ గౌరవం మరింత పెంచేందుకు కృషి చేస్తామని అన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన



నిలిచిన వాహనాలు (ఇన్‌సెట్‌లో గాయపడిన శివ)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

- ఎన్‌హెచ్‌ఎఐ సిబ్బంది నిర్లక్ష్యమంటూ బైఠాయింపు
- గంటపాటు స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని పాకివలస సమీపం జాతీయ రహదారిపై సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగికి చెందిన బత్తిరి శివ తీవ్రంగా గాయపడ్డారు. శివ శ్రీకాకుళం నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా.. పాకివలస వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శివ ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. ఎస్ఐ ఎనికె మహ్మద్‌అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కాగా ఎన్‌హెచ్‌ఎ సిబ్బంది రోడ్డుకు మధ్యలో ఉన్న మొక్కలు శుభ్రపరిచేందుకు కిలోమీటర్లు పొడవున ట్రాఫిక్ నియంత్రణ పరికరాలు ఏర్పాటు చేయడంతో ఈ ప్రమాదం సంభవించిందని పాకివలస గ్రామస్తులు జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో గంట సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

31 వరకు ధాన్యం కొనుగోలు

ఆమదాలవలస : ఈ ఏడాది ఖరీఫ్ పంట కాలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఈ నెల 31తో ముగియనుందని ఎఒ మెట్ట మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రాలు సంప్రదించి విక్రయించుకోవాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట కాలానికి సంబంధించి 17,461 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించగా, ఇందులో 17,134 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యకర్తలు

ఎమ్మెల్సీ చిరంజీవికి అభినందనలు

ప్రజాశక్తి- నౌపడ

ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీగా విజయం సాధించిన డాక్టర్ వేపాడ చిరంజీవిరావును సంతబొమ్మాళి మండల టిడిపి నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు విశాఖపట్నంలోని ఆయనను మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ... పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో కోటబొమ్మాళి మండల ఐటిడిపి అధ్యక్షులు బెండి అరుణ్ కుమార్, మండల తెలుగు యువత అధ్యక్షులు కూచెట్టి భానుప్రకాష్, టెక్కలి నియోజకవర్గం తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆరంగి శ్రీధర్, రావాడ ధర్మేంద్ర తదితరులు ఉన్నారు.



పరీక్షా సామగ్రిని అందజేస్తున్న ప్రిన్సిపాల్ సౌమ్య

పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని లోలుగు కెజిబివి పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు శ్రీకాకుళంలోని ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు పరీక్షా సామగ్రిని సోమవారం అందజేశారు. ఈ మేరకు పాఠశాలకు చెందిన 42 మంది విద్యార్థినులకు అట్టలను, పెన్నులను ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

తాడివలసలో...

మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 59 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు, ఆంగ్ల ఉపాధ్యాయులు మెట్ట అనంతభట్లు పరీక్షా సామగ్రిని అందజేశారు. అట్టలు, పెన్నులు, స్కేలు, పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్‌లను పంపిణీ చేశారు.

అంగరంగ వైభవంగా శుభరాట

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్వేచ్ఛావతి అమ్మవారి శుభరాట అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత సురంగి రాజా వారి కోట వద్ద వెదురు గెడకు పూజలు నిర్వహించి యాత్రికులు శోభాయాత్రతో ఆలయం వద్ద పూజలు నిర్వహించారు.. అనంతరం ఉప్పల వీధిలో ఉన్న ఉత్సవ మండపం వద్ద శుభరాట నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు యాత్రికులు భారీగా తరలివచ్చారు. దీంతో ఉప్పలవీధి జనసంద్రంగా మారింది. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో ఎటు వంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడం ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం నుంచి సంబరాల ఏర్పాట్లను చేయనున్నారు. ఇప్పటికే పట్టణంలోని ప్రతి వీధిలోనూ గ్రామ దేవత ఉత్సవాల విగ్రహాలతో మండపాలు సిద్ధం చేశారు. ఇచ్ఛాపురం ప్రవేశ ద్వారం, సంతపేట కూడలిలో ఆర్చిలను ఒడిశా కళాకారులు సిద్ధం చేస్తున్నారు. ఆలయ కమిటీ ఉత్సవాలను విజయవంతం చేయడానికి సన్నాహాలు చేసింది.



శుభరాటకు తరలివచ్చిన యాత్రికులు



కొత్తూరు : వసతిగృహంలో నీటిని పరిశీలిస్తున్న సిర్ల ప్రసాద్

జిల్లాలో భారీ వర్షం

పలాస: జిల్లాలోని శ్రీకాకుళం, పలాస, కొత్తూరు మండలాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు, లోతట్లు ప్రాంతాల్లో నీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. పలాస మండలంలోని సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి కాశీబుగ్గ మూడో రోడ్లు, శ్రీనివాస లాడ్జీ, ఎస్‌ఎంవి పార్లర్ కూడళ్లలో రోడ్లపై నీరు చేరింది. కిస్టుపురంలో డ్రెయినేజీ పనులు చేపట్టక పోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహించింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. పట్టణమంతా చీకటమయమైంది. విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

కొత్తూరు : భారీ వర్షానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులోని ఎస్‌సి బాలుర వసతిగృహం లోని మళ్లీ నీరు చేరింది. వర్షాన్ని ముందుగా గమనించిన వార్డెన్ ఉమాశంకరరావు విద్యార్థులను ముందస్తుగానే ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తరలించడంతో సమస్య నుంచి బయటపడ్డారు. ఇటీవల సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించినా మండలస్థాయి అధికారులు కాలువలు శుభ్రం చేయకపోవడంతో యథాస్థితిగా వసతిగృహంలో వర్షం నీరు చేరిపోయింది. విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ వసతిగృహానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. బత్తిలి రోడ్డు, పాలకొండ రోడ్డులోని వంశధార కాలువ వంతెనపై వర్షం నీరు చేరడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్థానిక గొడగల వీధిలో ఉన్న చోడవరపు పద్మ ఇంట్లో నీరు చేరడంతో సామగ్రికి తడిసిపోయింది.

ఆకట్టుకున్న 'డాగ్స్ ఫెస్ట్'

ప్రజాశక్తి- శ్రీకాకుళం

తొలిసారిగా డాగ్స్‌ఫెస్ట్‌ను నిర్వహించడం ఆనందంగా ఉందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలోని ఉమెన్స్ కళాశాల ఆవరణలో వెంకీస్ పెట్స్ ఆధ్వర్యాన డాగ్స్‌ఫెస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. డాక్టర్ సూర్యం మాట్లాడుతూ శునకాలు విశ్వాసానికి మారుపేరు అని, కుక్కలను ప్రేమతో పెంచుతున్న ప్రతిఒక్కరికీ కతజ్ఞతలు తెలిపారు. రాబిస్ వ్యాధి బారిన పడకుండా ఏటా ఒకసారి టీకాలు వేయాలని కోరారు. ఇందులో భాగంగా ఉచితంగా శునకాలు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



బహుమతిని అందజేస్తున్న లక్ష్మీదేవి

'ఆసరా'తో భరోసా

ప్రజాశక్తి- కవిటి

సిఎం జగన్ 'వైఎస్ఆర్ ఆసరా'తో మహిళలకు భరోసా కల్పించారని పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజ్ సాహు, మాణిక్యపురం సర్పంచ్ లలితా సాహు అన్నారు. ఆసరా మూడో విడత నిధులు పంపిణీలో భాగంగా సోమవారం మాణిక్యపురంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దేవరాజ్ సాహు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగా వారి అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సత్యవతి సాహు, మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆమదాలవలస: గ్రామీణ ప్రాంతాల్లోని స్వయంశక్తి సంఘ సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసుకుని వైఎస్ఆర్ ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నారని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని వంజంగి పంచాయతీలో సచివాలయ పరిధిలోని సర్పంచ్ బెండి సత్యవతి ఆధ్వర్యాన, అక్కులపేట, రామచంద్రాపురం గ్రామాల్లో సిఎం జగన్ చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో గురుగుబెల్లి ప్రభాకరరావు, చల్లా సింహాచలం, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు, స్వయంశక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పోలాకి : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది, తద్వారా మహిళా సాధికారత సాధించడమే ప్రభుత్వ ధ్యేయమని మండల పరిషత్ ప్రత్యేక సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం తూచా తప్పకుండా సంక్షేమ పథకాలను శతశాతం అమలు చేశారని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 31వ తేదీన ప్రియాగ్రహారం పాఠశాల మైదానంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని, విజయవంతం చేయాలని కోరారు.



కవిటి : సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు



బోరు పరికరాలను బిగిస్తున్న మెకానిక్‌లు

నీటిఎద్దడి నివారణకు చర్యలు

రణస్థలం: మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీ పరిధిలోని రణస్థలం, జె.ఆర్.పురం, దన్నానపేట, వెంకటేశ్వర కాలనీ, పిన్నింటిపేట, గరికపాలెం, సీతంవలస గ్రామాల్లో వేసవి కాలంలో నీటిఎద్దడి నివారణకు చర్యలు చేపట్టామని సర్పంచ్ భవిరి రమణ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సోమవారం వెంకటేశ్వ కాలనీలో నూతన హ్యాండ్ బోరు వేయించారు. అలాగే మరమ్మతులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. కుళాయిల ద్వారా నిరంతరం తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కార్యదర్శి ఆదినారాయణ, సహదేవ్, తవుడు, అనిల్, రాము, రామస్వామి పాల్గొన్నారు.

కుడి కాలువ పనులు పూర్తి చేయాలి

పొందూరు: మండల పరిధిలోని నారాయణ పురం కుడికాలువ పనులను కాంట్రాక్టర్లు వెంటనే పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జైకా నిధులతో గత టిడిపి హయాంలో పనులు ప్రారంభిస్తే... ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. గోకర్ణపల్లి ఏరియాలో రెండు కిలోమీటర్లు మేర అసలు పనులు పూర్తిగా చేపట్టలేదన్నారు. గతంలో ఈ ప్రాంతంలో కాలువకు అనేక సార్లు గండ్లు పడి పంటలు ముంపునకు గురి కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైన చోట సిమెంట్ లైనింగ్ కట్టకుండా అవసరమైన చోట సిమెంట్ లైనింగ్ కట్టి నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గండ్లు పడకుండా తక్షణమే పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరినాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు



వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న శార్వాణి

చిరు ధాన్యాల్లోనే పోషక విలువలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మనం తీసుకొనే ఆహారంలో పోషక విలువలు ఉన్నట్లు చూసుకోవాలని, చిరు ధాన్యాల్లో అవి పుష్కలంగా ఉంటాయని కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ డి.శార్వాణి అన్నారు. సోమవారం వెంకటాపురం సెక్టార్ పరిధిలోని రెయ్యిపాడు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేకంగా పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు కేంద్రాలకు వచ్చి భోజనం చేయాలని కోరారు. రక్తహీనత సమస్యలు తలెత్తకుండా ఆకు కూరలు, గుడ్లు, బెల్లంతో చేసిన పదార్థాలు తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా పుడుతుందని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.ధర్మారావు, సచివాలయ కన్వీనర్ మద్దిల హరినారాయణ, సూపర్‌వైజర్ సంతోషి, ఎంఎస్ కె.శిరీష, ఎఎన్ఎం, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

కవిటి: పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని బెజ్జిపుట్టుగ, దుగానపుట్టుగ, రాజపురం సర్పంచులు ఎస్‌పి నారాయణస్వామి, దూగాన భద్రాచలం, సనపల జానకిరావు అన్నారు. పోషక పఖ్వాడా పక్షోత్సవాల్లో భాగంగా రాజపురం, బెజ్జిపుట్టుగ గ్రామాల్లో సోమవారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఎసిడిపిఒ లావణ్య, సూపర్‌వైజర్ బి.సుజాత, ఎంపిటిసి కృష్ణారావు, విఆర్ఒ వజ్జ గిరిబాబు, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జలుమూరు: బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నుంచి దూరం కావచ్చని సిడిపిఒ కె.రూపలత అన్నారు. చల్లవానిపేట అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పఖ్వాడా నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : పోషకాహారాలతో మంచి ఆరోగ్యం లభిస్తుందని, ఇవి అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతుందని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి శోభారాణి అన్నారు. నగరంలోని దమ్మలవీధి అంగన్వాడీ కేంద్రంలో పోషణ పఖ్వాడా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొని పలు రకాల పోషక విలువలు గల పదార్థాలు ప్రదర్శించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నోడల్ అధికారి పి.మణి, పర్యవేక్షకులు పి.సీతామహాలక్ష్మి, ఎంఎస్‌కెలు శ్వేతహరిని, సబానాబేగం పాల్గొన్నారు.

పొందూరు: పౌష్టికాహార ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తెలుసుకోవాలని సిడిపిఒ డి.పాపినాయుడు అన్నారు. మండలంలోని కింతలి సెక్టార్‌లో సూపర్‌వైజర్ జి.వి.రత్నం ఆధ్వర్యాన పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను, కూరగాయలను, పండ్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని కింతలి సెక్టార్ పరిధిలోని అచ్చిపోలవలస, దల్లవలస-1, 2, ధర్మపురం-1, 2, పిల్లలవలస, కింతలి, కనిమెట్ట, తోలాపి, సింగూరు, ఎస్.జి.ఎన్.పేట గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు, సహాయకులు, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, ప్రధానోపాధ్యాయులు కె.ఎ.రాములు, వైద్యాధికారి శివశంకర్ పాల్గొన్నారు.

బురిడికంచరాంలో...

మండలంలోని లోలుగు సెక్టార్ పరిధిలోని బురిడికంచరాం అంగన్వాడీ కేంద్రం-3లో సూపర్‌వైజర్ శరణ్య పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం రాజేశ్వరి, ఎంఎస్‌కె భార్గవి పాల్గొన్నారు.



జలుమూరు : మాట్లాడుతున్న సిడిపిఒ రూపలత



కవిటి: ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న సర్పంచ్‌లు



శ్రీకాకుళం : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది



పొందూరు : కూరగాయలను పరిశీలిస్తున్న నాయకులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరవేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పైడిభీమవరం మహి మైదానంలో పైడిభీమవరం 1,2 గ్రామ సచివాలయం నాయకులతో, గ్రామ సచివాలయం కన్వీనర్లతో, గృహ సారథులతో, గ్రామ వాలంటీర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీకు అప్పగించిన 50 ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దశగా నడవాలన్నారు. వరికి ఎటువంటి సమస్యలు ఉన్నా సర్పంచ్, ఎంపిటిసి, గ్రామ నాయకులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, ఎంపిటిసిలు ఆకళ శ్రీనివాసరావు, మునకాల దుర్గారావు పాల్గొన్నారు.

నిద్దాంలో గడపగడపకు...

జి.సిగడాం: మండలంలోని నిద్దాంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రోడ్డు వేయాలని, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామస్థాయి చాలా సమస్యలు ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ... ఈ సమస్యలు త్వరలో పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల సత్యవతి, జెడ్‌పిటిసి కాయల రమణ, వైసిపి మండల అధ్యక్షులు బూరాడు వెంకటరమణ, బూత్ కమిటీ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, వైస్ ఎంపిపిలు మీసాల సాధ్వీమణి, రాంబాబు, బాతువ పిఎసిఎస్ చైర్మన్ పల్లాడ సన్యాసిరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలి అప్పలసూరి, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ పప్పల వేణుగోపాల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ తాతయ్య

కళాకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డాక్టర్ పి.తాతయ్య కోరారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద కళాకారుల దినోత్సవం సందర్భంగా సోమవారం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమదాలవలస కళాకారులకు పుట్టినిల్లు అని అన్నారు. జిల్లా కేంద్రంలో కళాకారుల కోసం బాపూజీ కళామందిర్ ఏర్పాటు చేశారని, అలాగే ఇక్కడా కళాకారులకు ఇండోర్ స్టేడియంను ఏర్పాటు చేయాలని కోరారు. ఇదే విషయమై కొన్నేళ్లుగా ప్రభుత్వాలను కోరుతున్నా ఇంతవరకు నెరవేరలేదని అన్నారు. ప్రజలను చైతన్యపరిచే కళాకారులను ప్రభుత్వం గుర్తించి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాకారుల సంఘ అధ్యక్షుడు టేకి త్రినాథరావు, ఉపాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్ధనరావు, తమ్మినేని విద్యాసాగర్, జేజే మోహనరావు, ఖండాపు గోవిందరావు, కళాకారులు పాల్గొన్నారు.

బైక్, సైకిల్ స్వాధీనం

పొందూరు: పొందూరు పట్టణంలోని కెవిఆర్ థియేటర్ వెనుక గల గృహ సముదాయంలో ఆదివారం రాత్రి బైక్, సైకిల్ చోరీకి గురయ్యాయి. గృహ సముదాయంలో నివశిస్తున్న కృష్ణకు చెందిన బైక్, అలాగే దామోదరరావుకు చెందిన సైకిల్‌ను చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వాహనాలను చోరీ చేసిన వ్యక్తిని పట్టుకుని వాహనాలను స్వాధీనం చేసుకుని సంబందిత యజమానులకు అప్పగించినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. చోరీ చేసిన వ్యక్తి మతిస్థిమితం సరిగ్గా లేదని, వాహనాలను స్వాధీనం చేసుకుని విడిచిపెట్టినట్లు తెలిపారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న క్లబ్ సభ్యులు

స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఏలియన్స్ క్లబ్ సభ్యులు కోరారు. తహశీల్దార్ గురుప్రసాద్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏలియన్స్ క్లబ్ కార్యదర్శి లక్ష్మణరెడ్డి, ఉపాధ్యక్షులు ఉమా శంకర్, పిఆర్ఒ దక్కత గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబ పెన్షనర్ల సమస్యలపై చర్చించుకోవడానికి భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. దీనికి తహశీల్దార్ సానుకూలంగా స్పందించారని అన్నారు. వినతిపత్ర అందించిన వారిలో ఎల్ఐసి బుజ్జి, బాలా, భీష్మ, యోగి, బాలకృష్ణ, విశ్రాంత ఉద్యోగులు కేశవరావు, మోహన్‌రావు, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాల మంజూరు

ప్రజాశక్తి- పలాస

రైతులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో పిఎసిఎస్ ఆధ్వర్యంలో రైతులకు రుణాలు మంజూరు చేస్తున్నామని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు అన్నారు. పలాస పిఎసిఎస్ కార్యాలయంలో మామిడిపల్లి గ్రామానికి చెందిన వంకల భాస్కరరావు రూ.5 లక్షలు, పలాస మున్సిపాలిటీ పెంటిభద్ర గ్రామానికి చెందిన సవర సునాధన రూ.5లక్షల చెక్కును ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి అభివృద్ధి కోసం దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిఇఒ శ్రీనివాస్, డిసిసిబి బ్యాంకు మేనేజరు, సూపర్‌వైజర్, బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్, మురళి, పిఎసిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న వెంకటరావు

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం


చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అన్వేష్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

దళిత క్రిస్టియన్లను ఎస్‌సి జాబితాలోకి చేర్చుతూ ఇటీవల అసెంబ్లీలో సిఎం వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి తీర్మానం చేయడం హర్షణీయమని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుల ప్రత్తి అన్వేష్ అన్నారు. పట్టణంలోని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా కార్యాలయంలో సిఎం జగన్ చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేశారు. ఇందులో భాగంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సిఎం అన్ని తరగతులకూ న్యాయం చేస్తున్నారని అన్నారు. దళితుల క్రిస్టియన్లను ఎస్‌టి జాబితాలో చేర్చడం వల్ల ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ తాడి ఆదిరెడ్డి, పాస్టర్ అధ్యక్షుడు ఏలియస్, కార్యదర్శి సుందర రాజ్, ప్రకాషరావు పట్నాయక్, ఆసి శ్రీనివాసరెడ్డి, పాల్, వీరబాబు, బిమ్మా బెహరా పాల్గొన్నారు.

జీవనోపాధుల మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లాలోని షెడ్యూల్డ్ తరగతుల అభ్యున్నతికి, జీవనోపాధి కార్యక్రమాల మెరుగుకు బ్యాంకుల ద్వారా సహాయ, సహకారాలు తప్పనిసరిగా ఉంటుందని ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ జిల్లా డైరెక్టర్ కంచరాన రామారావు అన్నారు. మండలంలోని గాజుల కొల్లివలస కాలనీలో ఉన్న లబ్ధిదారులను సోమవారం కలిసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా వారి జీవనోపాధులకు, పరపతి సౌకర్యం పెంపొందించేందుకు గతంలో బ్యాంకుల దగ్గర తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి ఉంటే... మళ్లీ రుణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ ఏడాదిలో బ్యాంకుల ద్వారా రుణం తీసుకొని యాక్టివిటీ చేస్తున్న లబ్ధిదారులను పరిశీలించి, వారు చేస్తున్న కార్యక్రమాల స్థితిగతులను, వారి ఆదాయ వనరులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎపిఎం పైడి కూర్మారావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్ రమణ, విఒఎ గురుమూర్తి పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న రామారావు


విద్యార్థిని అభినందిస్తున్న ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్

ఆదర్శ పాఠశాల విద్యార్థికి స్కాలర్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురుషోత్తపురం ఆదర్శ పాఠశాల విద్యార్థి జోగేష్ శస్మల్‌కు ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. ఫిబ్రవరి 5న జరిగిన పరీక్షలో 180 మార్కులకు 128 సాధించి జనరల్ కేటగిరీలో స్కాలర్ సాధించినట్లు తెలిపారు. ఈ ఘన విజయానికి కారణమైన అధ్యాపక బృందాన్ని ప్రిన్సిపల్ అభినందించారు. ప్రతి సంవత్సరం తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ స్కాలర్ షిప్‌కు ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి స్కాలర్ షిప్‌కు ఎంపికైన జోగేష్‌ను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

'గుడ్, బ్యాడ్ టచ్'పై అవగాహన

కవిటి: బాలికలు లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం సబ్ సెంటర్ చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ జాస్మిన్ కుమారి అన్నారు. మండలంలోని మాణిక్యపురంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం గుడ్ టచ్-బ్యాడ్ టచ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి పరిస్థితులైనా ధైర్యంగా ఎదుర్కొనేందుకు బాలికలు సిద్ధంగా ఉండాలని సూచించారు. బాలికల హక్కుల గురించి కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. మండల చైల్డ్‌లైన్ ప్రతినిధి ప్రసాద్ బిసాయి మాట్లాడుతూ బాలికలు అత్యవసర పరిస్థితుల్లో చైన్‌లైన్ హెల్ప్‌లైన్ 1098 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీస్, చైల్డ్‌లైన్ సిబ్బంది ఝాన్సీ, కృష్ణబాబు, లోకానాథం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిసాయి


మాట్లాడుతున్న జగన్మోహనరావు

ప్రాథమిక చికిత్సపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రాథమిక చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా రెడ్ సారథ్యంలో శాంతా కళ్యాణ అనురాగ నిలయంలో సోమవారం బేసిక్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కలిగి ఉండటం ద్వారా తమను తాము కాపాడుకోవడంతో పాటు ఇతరులనూ కాపాడవచ్చని చెప్పారు. పెంకి చైతన్య రక్తదానంపై అవగాహన కలిపించారు. అనంతరం పది మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జి.ఆర్.శ్రీకాంత్, బి.శ్రీధర్, బి.సతీష్‌కుమార్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న నిర్వాహకులు

ఆర్థికసాయం అందజేత

టెక్కలి: మండలంలోని నర్సింగపల్లికి చెందిన నిరుపేద ముద్ద కరువయ్య ఇంటి నిర్మాణానికి రాంబాబు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10వేలు నగదు ఆర్థిక సాయం చేసినట్లు నిర్వాహకులు ఎన్ని షణ్ముఖరావు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

కాలువలో సిల్ట్ తొలగింపు

ఇచ్ఛాపురం: పట్టణంలోని పలు వార్డులోని కాలువల్లో పేరుకపోయిన సిల్ట్ తొలగింపు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనరు రమేష్ శానిటరీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సిల్ట్ తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్